TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:32 THURSDAY ,JUNE 11,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 32 గురువారం 11 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

# ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత

- పూడికతీత చేపట్టి నిజాంసాగర్, శ్రీరాంసాగర్ నీటి నిలువ సామర్థ్యం పెంచుతాం
- కాలువ కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి తక్షణ చర్యలు
- మేడిగడ్డ పునరుద్ధరణకు కృషి
- రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
- జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలకు ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి
- సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలన



హంస కలం వార్త జూన్ 10 : ఉత్తర తెలంగాణ జిల్లాలలోని సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్ తదితరులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్ కు సంబంధించిన వివరాలతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు. 106 కోట్ల రూపాయల వ్యయంతో 7,975 ఎకరాల ఆయకట్టుకు 2లో

# ఆమెపై తెలంగాణలో ఎలాంటి కేసులు లేవు



వివరాలు 2లో

- మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికలు
- కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ
- ఇది బీజేపీ చేసిన సీట్ల దొంగతనం అంటూ సీఎం రేవంత్ రెడ్డి విమర్శ
- తెలంగాణలోని సివిల్ కేసు వివరాలు లేవని నామినేషన్ రద్దు
- ఈసీని కలిసేందుకు కాంగ్రెస్ యత్నం.. కోర్టుకు వెళ్తామని ప్రకటన
- కాంగ్రెస్ నేతలే సమాచారం ఇచ్చారంటున్న మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి

## మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను తప్పించాలని బీజేపీ కుట్ర



**ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకొని కుట్ర: మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై ఎంపీ చామల**

మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించిన ఎన్నికల అధికారులు

కుట్రపూరితంగా నామినేషన్ రిజెక్ట్ చేశారన్న చామల

కాంగ్రెస్‌ను రేసు నుంచి తప్పించేందుకు ముందు నుంచే బీజేపీ స్కెచ్ వేసిందని విమర్శ

హంస కలం వార్త :మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంపై రాజకీయ రగడ ముదురుతోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్

## 2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగాలి

-బండి సంజయ్



- ప్రధానిగా నెహ్రూ రికార్డును మోదీ బద్దలు కొట్టారన్న బండి సంజయ్
- అత్యధిక కాలం ప్రధానిగా మోదీ పేరు లిఖించబడిందని హర్షం
- మీనాక్షి నటరాజన్ వ్యవహారం ఎన్నికల కమిషన్ పరిధిలోనిదని వ్యాఖ్య

హంస కలం వార్త :భారత రాజకీయాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్య ధిక కాలం ప్రధానిగా కొనసాగిన తొలి ప్రధా ని జవహర్‌లాల్ 2లో

# పీసా చట్టం..

**ఆదివాసీల నిర్ణయాధికారానికి రక్షణ కవచం: మంత్రి సీతక్క**



-పేద వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ..
-పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదు..

హంస కలం వార్త
పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను కాపాడాలన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. -మిగతా 2లో

-జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమించిన మోదీ
-12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్డీఏ ప్రత్యేక సమావేశం
-ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న కార్యక్రమానికి అగ్రనేతల హాజరు
-మోదీకి అభినందనగా తీర్మానం ఆమోదించే అవకాశం



# ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర..

హంసకలం వార్త ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత రాజకీయాల్లో ఒక అరుదైన మైలురాయిని అందుకున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై కేంద్రంలో సుదీర్ఘకాలం పాటు నిరవధికంగా సేవలు అందించిన ప్రధానిగా ఆయన సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. బుధవారం నాటికి ప్రధానిగా 12 ఏళ్ల (4,399 రోజులు) పదవీకాలాన్ని మోదీ పూర్తి చేసుకున్నారు. మిగతా 2లో



# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సహా సంక్షేమ పథకాలు అమలు..

మున్నేరు వరద సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం..

పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపుతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి..

స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షించాలి..

3.05 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో బీటీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హంస కలం వార్త
ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు మిగతా 2లో

# రేవంత్ పాలనలో నిత్యం ఆడబిడ్డలపై అఘాయిత్యాలే


- ఖమ్మం బాలిక పై దురాగతం, మల్కాజ్ గిరి లో మహిళ కాల్చివేత ఘటనలు తీవ్రంగా కలిచివేశాయి
- సీఎం రేవంత్ రెడ్డి పాలనపై పట్టు కోల్పోయారు
- మహిళలపై అఘాయిత్యాలకు ప్రభుత్వానిదే బాధ్యత
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జూపల్లి

**మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం!**

-గతంలో వీపనగండ్ల వెళ్లినప్పుడు మినీ స్టేడియం కావాలని జూపల్లిని అడిగిన స్థానిక యువత
-తన సొంత భూమి ఇస్తానని నాడు మాట ఇచ్చిన జూపల్లి
-రూ. 1.50 కోట్లకు పైగా విలువున్న భూమిని విరాళంగా ఇచ్చిన మంత్రి



హంస కలం వార్త
రాజకీయాల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే నేతలు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో తాను ఒకడినని నిరూపించుకున్నారు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. యువత, క్రీడాకారుల భవిష్యత్తు కోసం ఆయన ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. మినీ స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని కేటాయిస్తూ బుధవారం 2లో




# హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి

కోర్టు ధిక్కరణ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీరుపై హైకోర్టు అసంతృప్తి
భూ వివాదాల్లో కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తున్నారని ఆరోపణలు
గతంలోనూ కమిషనర్‌కు పలుమార్లు నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం
చట్టానికి ఎవరూ అతీతులు కారని హైకోర్టు స్పష్టీకరణ
తాజా విచారణలో కమిషనర్ నుంచి పూర్తి వివరణ కోరిన కోర్టు

హంస కలం వార్త : కోర్టు ధిక్కరణ కేసుకు సంబంధించి 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కమిషనర్ ఏవీ రంగనాథ్ తీరుపై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిం ది. భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను పదేపదే ధిక్కరిం -మిగతా 2లో

## ఆమెపై తెలంగాణలో ఎలాంటి కేసులు లేవు

–మొదటి పేజీ **తరువాయి** :మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఇది బీజేపీ పన్నిన కుట్ర అని, ఆ పార్టీ 'సీట్ల దొంగతనానికి' పాల్పడిందని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇదొక చీకటి రోజని, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఓట్ల దొంగతనం తర్వాత ఇప్పుడు బీజేపీ సీట్ల దొంగతనానికి దిగిందని ఆరోపించారు. తెలంగాణకు చెందిన ఓ మాజీ కార్పొరేటర్ కేసుకు సంబంధించిన వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో మధ్యప్రదేశ్‌లో రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. ఈ వ్యవహారంపై జైరాం రమేష్ నేతృత్వంలోని కాంగ్రెస్ బృందం ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు ప్రయత్నించగా, వారిని అడ్డుకున్నారని సమాచారం. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే, ఈ కేసుకు సంబంధించిన సమాచారాన్ని కాంగ్రెస్ అంతర్గత నేతలే తమకు అందించారని మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి ఒకరు చెప్పడం గమనార్హం. మరోవైపు, ప్రతిపక్షాలను అణచివేసి, దేశంలో ఏక పార్టీ పాలనను స్థాపించడానికే బీజేపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని మీనాక్షి నటరాజన్ ఆరోపించారు.

## మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను తప్పించాలని బీజేపీ కుట్ర

–మొదటి పేజీ **తరువాయి** : ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక చిన్న ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకొని, కావాలనే కుట్రపూరితంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను రిజెక్ట్ చేశారని ఆయన విమర్శించారు. బీఎన్ఎస్ (దీచీూ) యాక్ట్ 230 ప్రకారం ఫామ్ 26 సబ్మిట్ చేయాల్సిన అవసరం లేదని... చట్టాలను తుంగలో తొక్కి బీజేపీ ఈ చర్యలకు పాల్పడుతోందని ఎంపీ స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐలతో పాటు ఎన్నికల సంఘాన్ని కూడా అడ్డం పెట్టుకొని... బీజేపీ ఈ ఎన్నికలను తమ ఖాతాలో వేసుకోవాలని చూస్తోందని చామల ఆరోపించారు. "మధ్యప్రదేశ్‌లో బలబలాల ప్రకారం బీజేపీకి రెండు రాజ్యసభ సీట్లు, కాంగ్రెస్‌కు ఒక సీటు వచ్చే అవకాశం ఉంది. అలాంటప్పుడు మూడో అభ్యర్థిని బీజేపీ ఎందుకు పోటీలో నిలబెట్టింది?" అని ఆయన ప్రశ్నించారు. దీన్ని బట్టే కాంగ్రెస్‌ను ఎలాగైనా రేసు నుంచి తప్పించాలని బీజేపీ ముందు నుంచే స్కెచ్ వేసిందని అర్థమవుతోందన్నారు. ఇదే తరుణంలో తెలంగాణ ప్రాంతీయ రాజకీయాలను ప్రస్తావిస్తూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయాలని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి కుట్రలు పన్నుతున్నాయని, ఆ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సంఘం ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఇక్కడి బీఆర్ఎస్ పార్టీ సమర్థిస్తుందా అని చామల నిలదీశారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తే ప్రజలు బుద్ధి చెబుతారని, ఎప్పటికీ అధికారంలోకి రాలేరని ఆయన హెచ్చరించారు.

## ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర..

–మొదటి పేజీ **తరువాయి** : 1952లో దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగిన తర్వాత నెహ్రూ పదవీకాలాన్ని (4,398 రోజులు) ఈ పోలికకు ప్రామాణికంగా తీసుకున్నారు. ఇందిరా గాంధీ 14 ఏళ్లకు పైగా ప్రధానిగా పనిచేసినప్పటికీ, ఆమె పదవీకాలం నిరంతరాయంగా కొనసాగలేదు. దీంతో 2014, 2019, 2024లలో వరుసగా మూడుసార్లు చారిత్రక విజయం సాధించి, నిరవధికంగా ప్రధానిగా కొనసాగుతున్న నేతగా మోదీ నిలిచారు. ఈ చారిత్రక ఘనతను, ఎన్డీఏ ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకోవడాన్ని పురస్కరించుకుని బుధవారం ఢిల్లీలోని భారత్ మండపంలో ఒక కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేతలు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్‌తో పాటు 22 ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, మిత్రపక్షాల నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీకి అభినందనలు తెలుపుతూ ఎన్డీఏ ఒక తీర్మానాన్ని ఆమోదించనున్నట్లు సమాచారం. ప్రభుత్వ విజయాలు, భవిష్యత్ విధానాలు, రాజకీయ వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. మోదీ హయాంలో కొత్త పార్లమెంట్ భవనం, సెంట్రల్ విస్టా, కర్తవ్య పథ్, వందే భారత్ రైళ్లు, స్టాట్యూ ఆఫ్ యూనిటీ, ఐఎన్ఎస్ విక్రాంత్ వంటి అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే.

## 2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగాలి

–మొదటి పేజీ **తరువాయి** :భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొనియాడారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన అరుదైన రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని హర్షం వ్యక్తం చేశారు. "రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. ఆయన తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా కేంద్ర ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని స్పష్టం చేశారు. ఇందులో రాజకీయ జోక్యం ఏమీ లేదని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## పీసా చట్టం.. ఆదివాసీల నిర్ణయాధికారానికి రక్షణ కవచం

–మొదటి పేజీ **తరువాయి** :

**పేద వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ..**

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు.

**పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదు..**

గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు. పీసా చట్టం అమలుకు గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పించాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత

–మొదటి పేజీ **తరువాయి** :106 కోట్ల రూపాయల వ్యయంతో 7,975 ఎకరాల ఆయకట్టుకు నీరందించే జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలను అట్టహాసంగా ప్రారంభించారు. హెలికాప్ట ర్‌లో సిద్దాపూర్ చేరుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కర్, నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, నిజామాబాద్ అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ తదితరులు హెలిప్యాడ్ వద్ద పుష్ప గుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాకోరాలో ఏర్పా టు చేసిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి, పౌర సరఫరాలకు ఎనలేని ప్రాముఖ్యత ఇస్తోందని గుర్తు చేశారు. భూసేకరణ, అటవీ అనుమతులు, ఆర్ అండ్ ఆర్ తదితర వాటి కోసం ప్రభుత్వ ం రూ. 5వేల కోట్లు కేటాయిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటో ందని అన్నారు. ఇందులో భాగంగానే లోయర్ మానేరు, మిడ్ మానేరు డ్యామ్ లు, కడెం ప్రాజెక్టులలో నీటి నిల్వ సామర్థ్యం పెంపొందిం చేందుకు పూడికతీత చేపడుతున్నామ ని తెలిపారు. అదే తరహాలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్, ఉత్తర తెలంగాణ జిల్లాలకు అత్యంత కీలకమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో కూడా పూడికతీత చేపట్టి రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం పెంపొంది స్తామని ప్రకటిం చారు. కాలువ కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు . గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజి లోపభూయిష్ట నిర్మాణం, డిజైన్ల వల్ల కొన్నాళ్ళకే కూలిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆక్షేపించారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరిట లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేశారని, అయినప్పట ికీ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని దుయ్యబట్టా రు. గత ప్రభుత్వ హయాంలో కట్టిన మేడిగడ్డ బ్యారేజి కొన్ని రోజులకే కూలిపోవడం జరిగిందని, కానీ నిజాం నవాబు నిర్మించిన నిజాంసాగర్, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మి ంచబడిన శ్రీరాంసాగర్, నాగార్జున సాగర్, జూరాల ప్రాజెక్ట లు మాత్రం ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఎంతో గట్టిగా నిలబడి ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. కాగా, సిద్దాపూర్ రిజర్వాయర్ పనుల పూర్తి కోసం సవరిం చిన ప్రతిపాదనల మేరకు అవసరమైన నిధులను తప్పక కేటాయిస్తామని హామీ ఇచ్చారు.అందులో ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాల ద్వారా 145 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, 48గంటల లోపే రైతుల ఖాతాలలో బిల్లులు జమ చేస్తూ రూ. 35 వేల కోట్లు చెల్లించామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో సైతం రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి భరోసా కల్పించారు. నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని 5లక్షల కుటుంబాలలోని 3.25 కోట్ల మందికి ఒక్కొక్కరికి ప్రతీ నెల ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ సలహాదారు, స్థానిక శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటగా తన నియోజకవర్గంలో జాకోరా, చందూర్ ఎత్తిపోతల పోతకాలను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో బాన్సువాడ నియోజకవర్గ రైతులు పంటలు సాగు చేస్తూ, అధిక దిగుబడులు సాధిస్తున్నారని అన్నారు. మొత్తం లక్షా 48 వేల ఎకరాలలో పంటలు పండిస్తున్నారని, 95వేల ఎకరాల ఆయకట్టుకు నిజాంసాగర్ నీరు సమకూరుతోందని తెలిపారు. 30 వేల ఎకరాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు జలాలు అందిస్తున్నామని, నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో లేని మిగతా భూములకు కూడా సాగు జలాలు అందించాలనే కృత నిశ్చయంతో సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టామని అన్నారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే నియోజకవర్గంలో సాగు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సిద్దాపూర్ రిజర్వాయర్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్ రావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్, సీ.ఈ శ్రీదేవి, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, తహసిల్దార్ ప్రశాంత్, సర్పంచ్ సాయిలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం...

–మొదటి పేజీ **తరువాయి** : బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇంట్లో కూడా అన్ని పనులను ఒకేసారి చేయలేమని, అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి ఎస్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరం లోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. ఖమ్మం నగర అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. మున్నేరు వరదల నేపథ్యంలో రూ.600 కోట్లతో రిటైనింగ్ వాల్ ప్రాజెక్టుకు మంత్రి కృషి చేశారని, పనుల పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.వెలుగుమట్ల అర్బన్ పార్కును హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహాలో అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలు సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నా యని తెలిపారు. నగర సుందరీకరణ, పచ్చదనం పెంపుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ.. మంత్రి ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో మెరుగైన రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌళిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ. ప్రజా పాలనలో గత రెండున్నర సంవత్సరాలుగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందించి ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి డివిజన్‌లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జూపల్లి.. మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం

–మొదటి పేజీ **తరువాయి** :గతంలో వీపనగండ్ల మండల పర్యటనకు వెళ్లిన సమయంలో.. అక్కడ స్థానిక యువత, క్రీడాకారులు తమకు ఒక మినీ స్టేడియం కావాలని మంత్రి జూపల్లిని అభ్యర్థించారు. వారి కోరికపై సానుకూలంగా స్పందించిన మంత్రి, స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని ఇస్తానని నాడు మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తూ.. వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నెం. 532/ఆ లో తన పేరిట ఉన్న 4 ఎకరాల భూమిని క్రీడాకారుల అభివృద్ధి కోసం అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఈ భూ బదిలీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా పూర్తయింది. వీపనగండ్ల మండల తహశీల్దార్ లాగిన్ ద్వారా నిర్వహించిన ఈ ఆన్‌లైన్ ప్రక్రియలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా డిజిటల్ సంతకం చేసి భూమిని ప్రభుత్వానికి బదిలీ చేశారు. మంత్రి కేటాయించిన ఈ నాలుగు ఎకరాల భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.1.50 కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ చారిత్రాత్మక భూ బదిలీ ప్రక్రియకు సాక్షులుగా కాంగ్రెస్ నాయకుడు మునిగొండ గోపి, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ డిజిటల్ సంతకాలు చేశారు. మంత్రి తీసుకున్న ఈ ఉదార నిర్ణయంపై వీపనగండ్ల మండల ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువత, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే.. గ్రామీణ ప్రాంతాల్లోని అద్భుతమైన ప్రతిభ గల యువకులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ఒక గొప్ప వేదిక లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రేవంత్ పాలనలో నిత్యం ఆడబిడ్డలపై అఘాయిత్యాలే

–మొదటి పేజీ **తరువాయి** :రేవంత్ రెడ్డి పాలనలో మహిళలపై నిత్యం అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట మహిళపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఖమ్మం నగరంలో 12 ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టి ఆ బాలికను నాలుగో అంతస్తు నుంచి తోసేసి హత్య చేయాలని ప్రయత్నించిన ఘటన దారుణమని కవిత అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోనే ఇలాంటి దారుణాలు జరుగుతుంటే మారుమూల ప్రాంతాల్లో మహిళలు, బాలికల భద్రత సంగతేంటనీ ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో మైనర్ బాలికపై జరిగిన అఘాయిత్యం ఘటనలో నిందితుడికి కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. అటు మల్కాజ్ గిరిలో ఓ వ్యక్తి తన భార్యను తుపాకీ తో కాల్చి చంపిన ఘటన దారుణమన్నారు. మూడు నెలల క్రితమే నిందితుడు తన భార్యను కాల్చిచంపుతాననంటూ బహిరంగంగా బెదిరించాడని కవిత గుర్తు చేశారు. అప్పుడే పోలీసులు స్పందించి చర్యలు తీసుకునే ఉంటే ఓ మహిళ నిండు ప్రాణం బలయ్యేదని కాదన్నారు.

**సీఎం పాలనపై పట్టుకోల్పోయారు**

మహిళల నేరాలను అరికట్టటంలో రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని కవిత అన్నారు. ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు గాడి తప్పాయని...ఖమ్మం, మల్కాజ్ గిరి ఘటనలే అందుకు సాక్ష్యమని కవిత అన్నారు. పాలన పై సీఎం రేవంత్ రెడ్డి పట్టు కోల్పోయారని కవిత విమర్శించారు. ఇకనైనా మేల్కొని మహిళల రక్షణ పై యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కవిత డిమాండ్ చేశారు. ఖమ్మం, మల్కాజ్ గిరి ఘటనల్లో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# హైడ్రా కమిషనర్ పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి..

–మొదటి పేజీ **తరువాయి**

:వివాదాస్పద ఆస్తుల వ్యవహారంలో కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలపై దాఖలైన పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా వివాదాస్పద స్థలాల్లో సైన్ బోర్డుల తొలగింపు, యథాతథ స్థితి (స్టేటస్ కో) పాటించకపోవడం వంటి అంశాలను కోర్టు ప్రస్తావించింది. కమిషనర్ అనుసరిస్తున్న వైఖరి, ప్రక్రియాపరమైన లోపాలపై న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరణ ఇచ్చే అవకాశాన్ని వినియోగించుకోకపోవడాన్ని తప్పుబట్టింది. విచారణకు గైర్హాజరవుతూ మినహాయింపు కోరుతూ కనీసం అఫిడవిట్ కూడా దాఖలు చేయకపోవడం ఆయన నిర్లక్ష్యానికి నిదర్శనమని ఘాటు వ్యాఖ్యలు చేసింది. హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, 20 రోజుల వరకు బోర్డును ఎందుకు తొలగించలేదో, విచారణకు ఎందుకు హాజరు కాలేదో వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ధర్మాసనం విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది. అనంతరం హైడ్రా తరపు న్యాయవాది అఫిడవిట్ సమర్పించడంతో వ్యక్తిగత హాజరు నుంచి కమిషనర్‌కు మినహాయింపునిచ్చింది. అయితే, దాఖలు చేసిన అఫిడవిట్ అసంపూర్తిగా, నిర్లక్ష్యంగా ఉందని అభిప్రాయపడిన కోర్టు.. మరింత సమగ్రమైన నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం రంగనాథ్ వృత్తిపరమైన కెరీర్‌పై ప్రభావం చూపుతుందని, ఈ విషయాన్ని ఆయనకు స్పష్టం చేయాలని న్యాయవాదికి సూచిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.


# సంపాదకీయం


## నరేంద్రుడు.. నవభారత పథనిర్దేశకుడు

సాధించిన విజయాలు, కాలపరిమితులు ఒక పరివర్తనాత్మక యుగానికి సరైన కొలమానాలు కావు. అవి కేవలం గణాంకాలు మాత్రమే. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికై అత్యంత సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ నిలిచారు. ఇది కేవలం ఒక ఘనతను సాధించడమో లేదా అధికార కాలపరిమితిలో రికార్డు సృష్టించడం మాత్రమే కాదు... అంతకంటే ఎంతో గొప్పది. కాలానికి ఉన్న అంతర్లీన భావాన్ని కేవలం సంఖ్యలతోనే చెప్పలేం. ఈ విధంగా ఆయన భారతదేశ అద్భుత మేధస్సు, రాజనీతిజ్ఞతలకు ప్రతీకగా నిలుస్తారు. రేంద్ర మోదీ ప్రజా జీవితం సామాన్య కార్యకర్తగా ప్రారంభమై అసాధారణ స్థాయికి ప్రస్థానించింది. సంఘ్ పరివార్ స్ఫూర్తితో ఒక సాధారణ ఆరెస్సెస్ కార్యకర్తగా ఆయన ప్రయాణం ప్రారంభమైంది. 1950లు, 1960ల నాటి రోజుల్లో తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో అప్పట్లో ఏ మాత్రం ప్రజాదరణ లేని సిద్ధాంతాన్ని ఆయన బలంగా సమర్థించారు, దీక్షా దక్షతలతో అనుసరించారు. ఆ కాలంలోని సంప్రదాయ రాజకీయ నాయకులకు భిన్నంగా ఆయనకు చెప్పుకోవడానికి ఎలాంటి రాజకీయ లేదా ఉన్నత వర్గాల నేపథ్యం లేదు. హారో, ఆక్స్‌ఫర్డ్, కొలంబియా లేదా హార్వర్డ్ వంటి విదేశీ విద్యాసంస్థల్లో చదువుకున్న విద్యార్థుల ప్రత్యేక క్లబ్‌లను ప్రపంచవ్యాప్తంగా అప్పట్లో ఎంతో గొప్పగా చూసేవారు. సర్ విన్‌స్టన్ చర్చిల్, భారతదేశ మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 'హారో బాయ్స్'గా ప్రసిద్ధులు. వారు ఒకే భాష మాట్లాడేవారు. ఉన్నత వర్గాల మధ్య ఉండే సాన్నిహిత్యాన్ని అంతర్జాతీయ వేదికలపై వారు పంచుకునేవారు. మోదీ వీటన్నింటికీ పూర్తిగా విభిన్నమైన మనిషి. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలతో మమేకమవడం ద్వారా మోదీ పొందిన క్షేత్రస్థాయి అనుభవం.. భారత సమాజం, ప్రజల ఆందోళనలు, వారి ఆకాంక్షల పట్ల ఆయనకు ఒక అసాధారణమైన అవగాహనను ప్రసాదించింది. ఆశయ సాధనలో ఆయనకు 'వ్యక్తిగత జీవితంలో నిరాడంబరత, ప్రజా జీవితంలో ఆచరణాత్మకత' అనే రెండు శక్తిమంతమైన వ్యక్తిత్వ లక్షణాలు తోడ్పడ్డాయి. పరస్పర విరుద్ధమైన పరిస్థితులను నరేంద్ర మోదీ ఎంతో సులువుగా సమన్వయం చేసుకుంటారు. ఉదాహరణకు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాయితీలపై ఆధారపడని ఒక వృద్ధి నమూనాను మోదీ గట్టిగా ప్రోత్సహించారు. అదే తరహాలో కరోనా తర్వాత కాలంలో-- దేశంలో ఎవరూ ఆకలితో అలమటించకుండా చూసేందుకు ప్రధానమంత్రిగా-- ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార భద్రతా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన ప్రవేశపెట్టిన సామాజిక గృహ నిర్మాణ పథకం, ఆయుష్మాన్ భారత్ వంటి బీమా పథకాలు సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలకు రక్షణగా నిలుస్తూ ప్రజలకు ప్రాథమిక అవసరాలైన కూడు, గూడు, గుడ్డ తీర్చడంతో పాటు ఆరోగ్య భద్రతకు పూచీపడుతున్నాయి. వాస్తవానికి మోదీ దేశ రాజకీయాలను అత్యంత లోతైన రీతిలో పునర్నిర్మించారు. దశాబ్దాల తరబడి దేశాన్ని పీడించిన సమస్యలు ఇప్పుడు కేవలం చరిత్ర పాఠ్య పుస్తకాల్లో భాగమైపోయాయి. ప్రజల సామూహిక ఆలోచనలలో అయోధ్య అంటే ఇప్పుడు ఒక భవ్యమైన దేవాలయం మాత్రమే గుర్తుకు వస్తుంది తప్ప ఒకనాటి మందిర్--మసీదు వివాద స్థలం కాదు. దేశవ్యాప్తంగా హిందూ దేవాలయాలను వాటి పూర్వ వైభవానికి పునరుద్ధరించడం... సాంస్కృతిక ఐక్యతకు సంబంధించిన ఒక శక్తిమంతమైన సందేశాన్ని ఇస్తోంది. ఆశ్చర్యమేమీ లేదు.. దక్షిణ ఆఫ్రికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత దేశ పర్యటన చేసినప్పుడు స్వయంగా మహాత్మాగాంధీ లాంటి మహోన్నత వ్యక్తి ఈ పునరుద్ధరణ కోసం కలలుగన్నారు. కాంగ్రెస్‌లోని గాంధీ శిష్యులు ఆయన ఆశయాన్ని నెరవేర్చడంలో విఫలమవగా మోదీ ఆ కలను సాకారం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జమ్మూ కశ్మీర్ ఒక మానని పాత గాయంలా మిగిలిపోయింది. రాజకీయ అస్పష్టత, ముస్లింలు అత్యధికంగా ఉన్న కశ్మీర్ లోయలో వేర్పాటువాదాన్ని, ఉగ్రవాదాన్ని మరింత రెచ్చగొట్టింది. భారత రాజ్యాంగ పరిధికి వెలుపల ఉండే 1953 నాటి పూర్వ స్థితిని పునరుద్ధరించాలని డిమాండు చేస్తూ జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ 2014 వరకు ఎన్నో తీర్మానాలను ఆమోదించింది. కానీ ఒక్క దెబ్బతో ఆ రాష్ట్రం రెండుగా విభజన అయి కేంద్రపాలిత ప్రాంతంగా మారింది. దీనితో ఆర్టికల్ 370 కేవలం గతానికి సంబంధించిన ఒక పనికిరాని అవశేషంగా మిగిలిపోయింది. గతంలో తిరుగుబాట్లు, హింసతో కొట్టుమిట్టాడిన ఈశాన్య రాష్ట్రాల విషయంలో కూడా ఇదే నిజమైంది. దేశ రాజకీయ ఆలోచనా సరళిని మోదీ పూర్తిగా మార్చివేసి దానిని మళ్లీ వెనక్కి తిప్పలేని ఒక మార్గంలో పెట్టారు. ప్రజా జీవితంలో ఇటువంటి విప్లవాత్మక మార్పు వచ్చినప్పుడు తీవ్రమైన ప్రతిస్పందనలు రావడం సహజం. దీని ఫలితంగానే మోదీకి ప్రశంసల కంటే విమర్శలే ఎక్కువగా ఎదురవుతుంటాయి. అయినప్పటికీ ఆయన ఏ మాత్రం వెనకడుగు వేయకుండా తన ఆశయాలకు కట్టుబడి స్థిరంగా ముందుకు సాగుతున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత భారత ప్రధానమంత్రిగా ఆయన సుదీర్ఘమైన 24 ఏళ్ల పరిపాలనా కాలంలో ప్రకృతి వైపరీత్యాలు, రాజకీయ సవాళ్ల రూపంలో ఎన్నో అపూర్వమైన సంక్షోభాలను మోదీ సమానంగా ఎదుర్కొన్నారు. అప్పటి యూపీఏ ప్రభుత్వం గుజరాత్ రాష్ట్రాన్ని దాదాపు ఒక శత్రువులా పరిగణించింది. అంతేకాకుండా తప్పుడు కేసుల ద్వారా ఆయనను బోనులో నిలబెట్టడానికి అప్పట్లో తీవ్రమైన ప్రయత్నాలు జరిగాయి. భారత్‌లో ఉగ్రవాదానికి మద్దతిస్తోన్న పాకిస్థాన్‌ను అడ్డుకోవడానికి సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటి వాటిని భారత్ చేపట్టినప్పటికీ ఉద్రిక్తతలు ఒక స్థాయి దాటి పెరగకుండా చాలా గట్టి నియంత్రణలో ఉంచారు. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తిస్థాయి యుద్ధాలుగా మారకుండా జాగ్రత్తపడ్డారు. పలు దేశాలతో దౌత్య సంబంధాలను పటిష్ఠం చేశారు. రాజకీయ ప్రత్యర్థులు ఆయనకు అనేక వైఫల్యాలను ఆపాదించొచ్చు. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న ప్రజాస్వామ్యంలో మోదీ లాంటి వ్యక్తిత్వాన్ని రకరకాలుగా విశ్లేషించడం సహజం. భారత్‌లో అత్యంత సుదీర్ఘకాలం పాటు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా ఆయన సాగించిన ప్రస్థానం ఎన్నో చరిత్రాత్మక సంఘటనలతో కూడుకున్నది. అది నిరంతరం ప్రజా సమీక్షకు లోబడి ఉంటుంది. చరిత్రకు-- భావోద్వేగాలు, పక్షపాతం ఉండవని అంటారు. మహాత్మాగాంధీ తన కాలంలో విమర్శలను, ప్రశంసలను రెండింటినీ ఎదుర్కొన్నారు. 'రక్తమాంసాలతో కూడిన ఇటువంటి ఒక వ్యక్తి ఈ భూమిపై నడిచాడంటే రాబోయే తరాలు అసలు నమ్మలేవు' అని గాంధీ గురించి ఆల్బర్ట్ ఐన్‌స్టైన్ గొప్పగా రాశారు. చరిత్రను అంత కచ్చితమైన పదాలలో అంచనా వేయడానికి ఐన్‌స్టైన్‌కు ఉన్న దూరదృష్టి అవసరం. కానీ భవిష్యత్ తరాల కోసం మోదీ గురించిన చారిత్రక పరిశీలన

# విపక్షాలకు ఒకే మాట, ఒకే బాట ఏదీ?






ఢిల్లీలో సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో వాడిపోయిన ముఖంతో కనపడ్డ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గట్టిగా హత్తుకున్నారు. ఒక స్త్రీ మనసును మరో స్త్రీ తప్ప మరెవరు అర్థం చేసుకోగలరు? 'కొన్ని దృశ్యాలను మాటల్లో చెప్పలేం' అని సీనియర్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరు మహిళలను గతంలో అంతర్జాతీయ సంస్థలు దేశంలోనే అత్యంత శక్తిమంతమైన నేతలుగా అభివర్ణించాయి. సోనియా పది సంవత్సరాలకు పైగా దేశ రాజకీయాలను శాసిస్తే, మమతా బెనర్జీ 15 సంవత్సరాలు బెంగాల్ రాజకీయాలను శాసించారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని వారికి తెలియనిది కాదు. గత నెలలో వెలువడిన అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ వ్యతిరేక శక్తులు మళ్లీ ఢిల్లీలో సమావేశమయ్యాయి. నిన్నటి వరకూ తాము కాంగ్రెస్‌ను కూడా ఢీకొన్న విషయాన్ని మరిచిన మమతా బెనర్జీ, వామపక్షాలు జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమయ్యాయి. తృణమూల్ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై రాహుల్‌గాంధీ ఇటీవలే తనను తీవ్రంగా విమర్శించిన విషయాన్ని మమతా బెనర్జీ మరిచి పోయినట్లే కనపడుతోంది. 'దేశంలో కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది. ఇక జాతీయ స్థాయిలో నేనే కీలక పాత్ర పోషిస్తాను' అని 2021లో ప్రధానమంత్రి పదవి గురించి కలలు కన్న విషయం కూడా ఆమెకు ఇప్పుడు గుర్తుండే అవకాశాలు లేవు. 1998లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి కోల్‌కతాలో ఏఐసీసీ ప్లీనరీ జరుగుతున్నప్పుడు ర్యాలీ నిర్వహించి పార్టీని ప్రకటించిన బెబ్బులి మమతా బెనర్జీ ఇప్పుడు కోరలు తీసేసినట్లే కనపడుతున్నారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో తృణమూల్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఆమెపైనే తిరుగుబాటును ప్రకటించారు. ఆమె కుడిభుజం అభిషేక్ బెనర్జీ. ఎంపీ కల్యాణ్ బెనర్జీ తదితర తృణమూల్ నేతలపై వీధుల్లో దాడులు జరుగుతున్నాయి. మమత ఒకప్పుడు ప్రత్యర్థులపై అవలంబించిన విధానాలే ఇప్పుడు ఆమెపై ప్రత్యర్థులు ప్రయోగిస్తున్నారు. కోల్‌కతా వీధుల్లో ఇప్పుడు మమతా బెనర్జీ, ఆమె వర్గీయులు అరణ్య రోదన చేస్తుంటే వారికి అండగా ఇప్పుడు కాంగ్రెస్ నేతలే నిలిచే పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో అటు రాష్ట్రంలోనూ, ఇటు ఢిల్లీలోనూ బీజేపీ వంటి మహాశక్తిని ఎదుర్కోవాలంటే కాంగ్రెసే శరణ్యమని మమతా బెనర్జీ గ్రహించినట్లు కనపడుతోంది. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాలు సీట్లు పెద్దగా గెలుచుకోనప్పటికీ తృణమూల్‌ను బాగా దెబ్బతీయగలిగాయి. ముర్షిదాబాద్, మాల్డా, ఉత్తర్ దినాజ్‌పూర్ లాంటి మైనారిటీల ఆధిపత్యం ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్--వామపక్ష కూటమి తృణమూల్‌కు సంప్రదాయంగా లభించే మద్దతు రాకుండా చూశాయి. 50శాతానికి పైగా ముస్లింల జనాభా ఉన్న 32 అసెంబ్లీ స్థానాల్లో తృణమూల్ ఒక్క సీటును కూడా గెలుచుకోలేదు. జంగీపూర్ అనే నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 31వేల ఓట్లు రాగా తృణమూల్ అభ్యర్థికి 10,542 ఓట్లు మాత్రమే లభించాయి. అదే కరండిఘి అనే నియోజకవర్గంలో సీపీఐ(ఎం)కు 39వేల ఓట్లు రాగా, ఆ పార్టీ అభ్యర్థిపై బీజేపీ అభ్యర్థి 20వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు. బహుశా ఈ ఫలితాలు వచ్చిన తీరు మమతా బెనర్జీకి తన అహంకారం, దౌర్జన్య పూరిత ధోరణి, మిత్రపక్షాలను లెక్కచేయనితనం గురించి గుణపాఠాలు నేర్పే ఉంటుంది. అందుకే ఆమె ఇప్పుడు ఢిల్లీ వీధుల్లో కనపడుతున్నారు. ఇక దేశంలో తమ కాళ్ల కింద నేల క్రుంగిపోతున్న వామపక్షాలకు కూడా ఢిల్లీ వీధులే శరణ్య ంగా మారాయి. 140 సీట్లున్న కేరళ అసెంబ్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 100 సీట్లకు పైగా గెలుచుకోవడం, బీజేపీ మూడు సీట్లు గెలుచుకోవడం, పినరయి విజయన్ కేబినెట్‌లో అత్యధిక మంత్రులు పరాజయం పాలుగావడం విస్మరించదగ్గ విషయం కాదు. అక్కడ కూడా పినరయి విజయన్ పదేళ్ల కేంద్రీకృత అహంకార పాలన, రైతులు, యువత, ఆశా వర్కర్లు తీవ్ర నిరుత్సాహానికి గురికావడం, పార్టీ కేడర్ అసంతృప్తి... వంటివి వామపక్ష కూటమి పరాజయానికి కారణమని విశ్లేషకులు అభివర్ణించారు. పినరయి విజయన్ బీజేపీతో కుమ్మక్క య్యారని, అవినీతిపరులను ప్రోత్సహిస్తున్నారని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు విమర్శించారు. విజయన్‌పై కేంద్ర ఏజెన్సీలు ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. ఏమైతేనేం అయిదు దశాబ్దాల తర్వాత దేశంలో ఎక్కడా అధికారంలో లేని పరిస్థితికి వచ్చిన వామపక్షాలు బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేయడం తప్ప తమకు మరో మార్గం లేదని గ్రహించాయి. ఇండియా కూటమి సమావేశానికి హాజరైన వామపక్ష నేతలు డి.రాజా, జాన్ బ్రిటాస్‌కు ఆ స్పష్టత ఉన్నది. దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితిని రెండేళ్ల క్రితం మరణించిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి బాగా అర్థం చేసుకున్నారు. సీపీఐ(ఎం) బహిష్కరించిన ప్రసేనజిత్ బోస్‌ను కాంగ్రెస్ తన పార్టీలో చేర్చుకు న్నప్పుడు 'మీ కామ్రేడ్‌ను మేము మా పార్టీలో చేర్చుకున్నాం' అని రాహుల్‌గాంధీ ఏచూరితో పరిహాసమాడారు. 'మీ వాడు, మా వాడు అనేది ఏముంది, ఈ పోరులో మనమిద్దరమూ ఒకే పడవలో ప్రయాణిస్తున్నాం' అని ఏచూరి నవ్వుతూ జవాబిచ్చారు. దేశంలో బీజేపీ అడ్డూ ఆపూ లేకుండా దూసుకువస్తున్న పరిస్థితుల్లో ఆ పార్టీని ఎదుర్కొనేందుకు అన్ని బీజేపీ వ్యతిరేక శక్తులూ సంకుచిత ధోరణి వీడి కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన ఎప్పుడో గ్రహించారు. ఇవాళ ఎన్డీఏలో ఉన్న పార్టీలేవీ ఎన్నికల్లో పరస్పరం పోటీపడడం లేదు. కానీ ఇండియా కూటమిలో ఉన్న పార్టీలకు ఆ మేరకు సమైక్యత లేదు. దాదాపు రెండేళ్ల తర్వాత ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన 23 పార్టీలకు ఎంత మేరకు లక్ష్యశుద్ధి ఉన్నది? డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీలు హాజరు కాకపోవడంలో మర్మం ఏమిటి? ఎమర్జెన్సీ అనంతరం 1977లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఒకే ఎన్నికల గుర్తుపై జనతా పార్టీ పేరుతో పోటీ చేశాయి. అప్పటి చిత్తశుద్ధి, పోరాట స్ఫూర్తి ఇప్పుడు ఎన్ని పార్టీలకు ఉంది? మిత్రపక్షాలను కూడా తన సైద్ధాంతిక బాటలో నడిపించగలిగిన బీజేపీ మాదిరి కాంగ్రెస్ ఇతర పార్టీలకు సారథ్యం వహించగలదా? ఇండియా కూటమి సమావేశం జరిగిన రెండు రోజుల తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశాన్ని ఏర్పరిచారు. పేరుకు ఇది ఎన్డీఏ సమావేశమైనా, జరుగుతోంది బీజేపీ సమావేశమే. నాగాలాండ్, మేఘాలయ, పుదుచ్చేరి వంటి చిన్న రాష్ట్రాలను పక్కన పెడితే ఎన్డీఏ పాలన అమలులో ఉన్న అతి పెద్ద రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. నిన్నమొన్నటి వరకు బిహార్‌లో జనతాదళ్(యు) అధినేత నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఇప్పుడు అక్కడ కూడా బీజేపీ నేతే ముఖ్యమంత్రిగా ఉన్నారు. నితీశ్ రాజ్యసభకు రావడంతో లోక్‌సభలో ఉన్న 12 మంది జేడీ(యు) ఎంపీలకు మోదీయే నాయకుడుగా భావించవలసి ఉంటుంది. లోక్‌సభలో 28 మంది తృణమూల్ ఎంపీలు ఉండగా, ఆ పార్టీ చీఫ్ విప్ కాకోలీ ఘోష్ దస్తిదార్ నేతృత్వంలోని 20 మంది ఎంపీలు మమతా బెనర్జీపై తిరుగుబాటు చేసి తమను ప్రత్యేక గ్రూప్‌గా గుర్తించమని స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని నిర్ణయించారు. వీరు కూడా ఏ సుముహూర్తాన్నో బీజేపీలో చేరి, ఆ పార్టీ ఎంపీలుగా కాషాయ కండువా కప్పుకోక తప్పదు. అంటే బీజేపీకి తెలుగుదేశం ప్రమేయం లేకుండానే ఇప్పటికే లోక్‌సభలో పూర్తి మెజారిటీ వచ్చినట్లే లెక్క. అంతేకాక శివసేనకు చెందిన ఏడుగురు, లోక్ జనశక్తికి చెందిన అయిదుగురు, జనతాదళ్ సెక్యులర్‌కు చెందిన ఇద్దరు, రాష్ట్రీయ లోక్‌దళ్‌కు చెందిన ఇద్దరు, ఎన్సీపీ పవార్ గ్రూప్‌కు చెందిన ఒక్కరు, అప్నాదళ్, హిందూస్థానీ ఆవామీ మోర్చాకు చెందిన ఇద్దరితో పాటు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ఆరుగురు ఇప్పటికే బీజేపీకి మద్దతునిస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక శివసేన, ఎన్సీపీ, లోక్ జనశక్తి, రాష్ట్రీయ లోక సమతా పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ వంటి పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన ఘనత, పలువురు ఇతర పార్టీల నేతలను తమతో పాటు కలుపుకున్న ఘనత భారతీయ జనతా పార్టీకి దక్కింది. అంతే కాదు, మోదీ హయాంలోనే బీఎస్పీ, బీజేడీ, అన్నాడీఎంకేతో పాటు పలు ప్రాంతీయ పార్టీల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. మోదీకి దాసోహం అనకపోతే తమ మనుగడ కష్టమని పలు ప్రాంతీయ పార్టీలు భావించే పరిస్థితి దేశంలో నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన నేడు 13వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న దృష్ట్యా ఆయన రాజకీయాలు ఇంకెంత తీవ్ర స్థాయిలో ఉంటాయో అన్న విషయమై సోషల్ మీడియాలో వ్యాఖ్యలు, కాక్రోచ్ జనతా పార్టీ వంటి పరిణామాలు, ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడడం, న్యాయవ్యవస్థ లొంగిపోయిందనే ఆరోపణలు, నీట్, సీబీఎస్ఈ వంటి సంస్థలు పరీక్షలను నిర్వహించలేని వైఫల్యంపై ఎన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ రాజకీయంగా మోదీ బలం రోజురోజుకూ పెరుగుతోందనే విషయాన్ని ఎవరూ కాదనలేరు. అంతర్వైరుధ్యాలను తొలగించుకోకుండా, సమాన ప్రత్యామ్నాయ దృక్పథాన్ని ఏర్పర్చుకోకుండా ఎన్ని సమావేశాలు నిర్వహించినప్పటికీ ప్రతిపక్షాలు కానీ, ఇతరేతర శక్తులు కానీ ఏ మార్పును సాధించగలుగుతాయి?

# హక్కుల కోసం పోరాడండి

-హక్కుల కోసం ప్రజలు పోరాడాల్సిందే..
-మౌనం సమస్యలకు దారి తీస్తుంది..
-ఓటు హక్కే ప్రజాస్వామ్యానికి అసలైన ఆయుధం..
-ప్రజల చైతన్యంతోనే మార్పు సాధ్యం..

హంస కలం వార్త జూన్ 10 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

దేశంలో పెరుగుతున్న ధరలు, ఆర్థిక సవాళ్లు, యువత భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో ప్రజలు తమ హక్కుల పరిరక్షణ కోసం చైతన్యవంతంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులని, హక్కుల సాధన కోసం ప్రజలు ఐక్యంగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు తమ హక్కుల కోసం గళం విప్పి పోరాడినప్పుడే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ అన్నారు. హక్కుల పరిరక్షణ విషయ ంలో ప్రజలు మౌనంగా ఉంటే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దేశంలో చోటుచేసుకుంటున్న రాజకీయ, ఆర్థిక పరిణామాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పెరుగుతున్న ఇంధన ధరలు, రూపాయి విలువ క్షీణత, ఉపాధి అవకాశాలపై నెలకొన్న అనిశ్చితి వంటి అంశాలు సామాన్య ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు తమ హక్కులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన యజమానులని, ఓటు హక్కును సక్రమంగా వినియోగించడం ద్వారా వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజలే ముందుకు రావాల్సిన అవసరం ఉందని, చైతన్యవంతమైన సమాజమే బలమైన ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొన్నారు. న్యాయం,



సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పటిష్టంగా మారుతుందని చెప్పారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తూ, తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాలని గడ్డం వంశీకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల చైతన్యమే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# రాజ్యసభ సీటుపై రాజకీయ రగడ

-రాజ్యసభ సీటుపై వేడెక్కిన రాజకీయాలు..
-మీనాక్షి నటరాజన్‌కు అన్యాయమన్న కాంగ్రెస్..
-ఓటు విలువను దెబ్బతీస్తున్నారన్న విమర్శ..
-బీజేపీ వైఖరిపై వంశీకృష్ణ ధ్వజం..

హంస కలం వార్త జూన్ 10 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి రావాల్సిన రాజ్యసభ స్థానాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా లేవనెత్తుతున్న ఓటు దోపిడీ అంశం మరోసారి నిజమవుతోందని అన్నారు. ప్రజలు తమ ఓటు ద్వారా ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన బాధ్యత అధికార పక్షంపై ఉందని, అయితే ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచే విధంగా చర్యలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశ ప్రజలకు కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ఆ హక్కును నిర్వీర్యం చేసే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోరాదన్నారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి శాసనసభ బలాబలాల ప్రకారం ఒక రాజ్యసభ స్థానం దక్కాల్సి ఉండగా, ఆ స్థానానికి ఎంపికైన మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను సాంకేతిక కారణాలు చూపుతూ తిరస్కరించడం పలు అనుమానాలకు తావిస్తోందని వంశీకృష్ణ అన్నారు. కాంగ్రెస్‌కు రావాల్సిన స్థానాన్ని అడ్డుకుని, ప్రత్యర్థి పార్టీకి ప్రయోజనం కలిగే పరిస్థితులు సృష్టించడం ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే చర్యగా భావిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఓట్లతో ఏర్పడిన రాజకీయ సమీకరణాలను పక్కనపెట్టి, ప్రజా తీర్పును మార్చే



ప్రయత్నాలు జరిగితే అది రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని గౌరవించడం ప్రతి సంస్థ బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి న్యాయబద్ధంగా రావాల్సిన రాజ్యసభ స్థానాన్ని అడ్డుకోవడంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని, ఈ అంశంపై ప్రజలు కూడా ఆలోచించాలని గడ్డం వంశీకృష్ణ పిలుపునిచ్చారు.

## టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటీ)గా బాధ్యతలు స్వీకరించిన ఎం.రాజశేఖర్

-ఐటీ విభాగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రయాణికులకు డిజిటల్ సేవలు విస్తరిస్తాం : -ఈడీ ఎం. రాజశేఖర్
-సంస్థ ఎండీ వై. నాగిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన నూతన ఈడీ రాజశేఖర్

( జూన్ - 10- హంస కలంవార్త )

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటీ,వి, ఎ.ఎం & టీగల్) గా సీనియర్ అధికారి ఎం. రాజశేఖర్ బుధవారం హైదరాబాద్‌లోని బస్ భవన్ లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన ఈడీకి సంస్థ ఉన్నతాధికారులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టీసీ ఐటీ (IT) విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామని, ప్రయాణికులకు టికెట్ బుకింగ్ మరియు లైవ్ బస్ ట్రాకింగ్ వంటి డిజిటల్ సేవలను మరింత సులభతరంగా అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఐటీ విభాగంతో పాటు వర్క్‌షాప్, అస్సెట్ మేనేజ్‌మెంట్ మరియు లీగల్ విభాగాల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సంస్థ ఆదాయ వనరులను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, అంతర్గత పరిపాలనను వేగవంతం చేస్తామని, అలాగే సంస్థకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను సకాలంలో పరిష్కరించి



ఆర్టీసీ ప్రయోజనాలను కాపాడుతామని ఆయన పేర్కొన్నారు. యాజమాన్యం, అధికారులు మరియు కార్మికులను సమన్వయం చేసుకుంటూ టీజీఎస్ ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సామూహికంగా కృషి చేస్తామని ఈడీ రాజశేఖర్ తెలిపారు.

## జగద్గిరి నగర్ లో జనాల గోడు అధికారులు పట్టించుకోవడం లేదు

-ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన, ధర్నాలు చేసిన ఫలితం శూన్యం.. బిఆర్ఎస్ నాయకులు కొలుకుల జైహింద్

( జూన్ - 10- హంస కలంవార్త )

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరి నగర్ లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. కార్పొరేషన్ రద్దు అయిన నాటినుండి అధికా రులు పూర్తిగా నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నారని బి ఆర్ ఎస్ నాయకులు కొలుకుల జైహింద్ అధికారులు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం జగద్గిరి నగర్ లో ఆయన పర్యటించి సమస్యను పర్య వేక్షించారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహ రిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మున్సిపల్ అధికారులు సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నా రన్నారు. జగద్గిరి నగర్ లో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని పలు దఫాలుగా అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ స్పందించ చకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ సమస్య పరిష్కారం మంచినీటితో మురుగునీరు కలిసి



ప్రవహిస్తున్న వలన ప్రజల కుళాయిలో మురుగునీరు రావడం ఇక్కడ గత కొన్ని రోజులుగా పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవికాలంలోనే సమస్య ఎంత జటిలంగా ఉంటే రానున్న వర్షాకాలంలో ఎలా ఉంటుందని ప్రశ్నించారు. వెంటనే మునిసిపల్ అధికారులు, జలమండలి అధికారులు స్పందించి సమస్య సమస్య పరిష్కరించకపోతే బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యా లయం ముందు, జలమండలి కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంతోష్. విజయ్. శ్రీనివాస్ రాకేష్. లత. పద్మ. ఉమా. లావణ్య. కనకమ్మ బస్తివాసులు పాల్గొన్నారు



# మందమర్రి నుంచి జర్మనీ దాకా

-జర్మనీ ఉద్యోగాలకు తెలంగాణ యువతకు కొత్త దారి..
-మందమర్రిలో జర్మన్ భాషా శిక్షణ కేంద్రం ప్రారంభం..
-విదేశీ ఉపాధిపై మంత్రి వివేక్ వెంకటస్వామి ఫోకస్..
-ప్రపంచ అవకాశాలకు యువతను సిద్ధం చేస్తున్న ప్రభుత్వం..



హంస కలం వార్త జూన్ 10

మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్ తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని ఇల్లందు క్లబ్‌లో తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థ ఆధ్వర్యంలో, ఉపాధి శిక్షణ శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే విదేశీ భాషలపై పట్టు సాధించడం అత్యంత అవసరమని అన్నారు. ముఖ్యంగా జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో నైపుణ్యం కలిగిన యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థ ద్వారా భాషా శిక్షణతో పాటు నైపుణ్యాభివృద్ధి, వృత్తి మార్గదర్శకత్వం, విదేశీ ఉద్యోగ అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జర్మన్ భాషా శిక్షణ కేంద్రం రాష్ట్ర యువతకు ప్రపంచ స్థాయి అవకాశాల తలుపులు తెరవడమే కాకుండా, విదేశీ ఉపాధి సాధనలో కీలక వేదికగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ యువత ప్రతిభ, సామర్థ్యాలపై పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్న మంత్రి, ఈ శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌లో తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో మరింత ప్రోత్సాహం అందించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్మన్ భాషా శిక్షణ కేంద్రం ప్రారంభంతో మంచిర్యాల జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ యువతకు విదేశీ ఉపాధి అవకాశాల దిశగా కొత్త మార్గాలు తెరుచుకోనున్నాయని స్థానిక యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం తెలంగాణ యువత భవిష్యత్తుకు మరింత భరోసాను కల్పించనుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్‌కు ఘన సన్మానం



( జూన్ - 10- హంస కలంవార్త )

మూసాపేట్ ఇందిరా నగర్ నుండి గూడ్స్ షెడ్ రోడ్ వరకు ఉన్న రోడ్ మొత్తం వాహనాలు నిలిపి,చెత్తా చెదారంతో పేరుకుపోయి ఉన్న విషయం మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగానే ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించి, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సి.సి. కెమెరాను ఏర్పాటు చేయించినందుకు గాను వారిని స్థానిక ప్రజలు ఘనంగా సన్మానించారు. కాలనీలో చెత్తాచెదారం, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న తరుణంలో శ్రావణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని స్థానికులు కొనియాడారు. ఈ సందర్భంగా ఇందిరా నగర్ బస్తీ వాసులు శ్రావణ్ కుమార్ ని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గరిగె తుకారాం, బాలరాజు గౌడ్, ఇనుగంటి రాజు, చెరుకు సత్యనారాయణ, యాదిలాల్, శ్రీనివాస్, స్వామి గౌడ్, గణేష్ యాదవ్, నరేష్ , ఎం.సరిత, శోభ, అనసూయ, యశోద తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలం వరదలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

( జూన్ - 10- హంస కలంవార్త )



నిర్మల్ పట్టణంలో వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై నీరు నిలవ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పట్టణంలో గతంలో వర్షాలు కురిసి నీటిమయమైన శివాజీ చౌక్ మంచిర్యాల చౌరస్తా,విశ్వనాథ్ పేట్, సిద్ధాపూర్ వాగు ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఈ వర్షాకాలంలో పట్టణంలో ఎక్కడ కూడా రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండరాదని పేర్కొన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు వర్షాకాలం పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పట్టణ ప్రజలకు వరద నీటి వల్ల ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. డ్రైనేజీలు,నాలాలు పరిశీలించారు. ఎప్పటికప్పుడు పూడికలు తీసివేస్తూ నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హంస కలం వార్త

గురువారం 11 జూన్ 2026

## రేవంత్ పాలనలో నిత్యం ఆడబిడ్డలపై అఘాయిత్యాలే

-ఖమ్మం బాలిక పై దురాగతం, మల్కాజ్ గిరి లో మహిళ కాల్చివేత ఘటనలు తీవ్రంగా కలిచివేశాయి

-సీఎం రేవంత్ రెడ్డి పాలనపై పట్టు కోల్పోయారు

-మహిళలపై అఘాయిత్యాలకు ప్రభుత్వానిదే బాధ్యత

-తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



( జూన్ - 10- హంస కలంవార్త )

రేవంత్ రెడ్డి పాలనలో మహిళలపై నిత్యం అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట మహిళపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఖమ్మం నగరంలో 12 ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టి ఆ బాలికను నాలుగో అంతస్తు నుంచి తోసేసి హత్య చేయాలని ప్రయత్నించిన ఘటన దారుణమని కవిత అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోనే ఇలాంటి దారుణాలు జరుగుతుంటే మారుమూల ప్రాంతాల్లో మహిళలు, బాలికల భద్రత సంగతేంటనీ ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో మైనర్ బాలికపై జరిగిన అఘాయిత్యం ఘటనలో నిందితుడికి కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. అటు మల్కాజ్ గిరిలో ఓ వ్యక్తి తన భార్యను తుపాకీ తో కాల్చి చంపిన ఘటన దారుణమన్నారు. మూడు నెలల క్రితమే నిందితుడు తన భార్యను కాల్చిచంపుతానంటూ బహిరంగంగా బెదిరించాడని కవిత గుర్తు చేశారు. అప్పుడే పోలీసులు స్పందించి చర్యలు తీసుకునే ఉంటే ఓ మహిళ నిండు ప్రాణం బలయ్యేదని కాదన్నారు.

-సీఎం పాలనపై పట్టుకోల్పోయారు

మహిళల నేరాలను అరికట్టటంలో రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని కవిత అన్నారు. ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు గాడి తప్పాయని...ఖమ్మం, మల్కాజ్ గిరి ఘటనలే అందుకు సాక్ష్యమని కవిత అన్నారు. పాలన పై సీఎం రేవంత్ రెడ్డి పట్టు కోల్పోయారని కవిత విమర్శించారు. ఇకనైనా మేల్కొని మహిళల రక్షణ పై యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కవిత డిమాండ్ చేశారు. ఖమ్మం, మల్కాజ్ గిరి ఘటనల్లో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

-చివరి శ్వాస వరకు ప్రజా సమస్యలపై పోరాడారు

తెలంగాణ ఉద్యమకారుడు, సోషలిస్ట్ నాయకుడు మురళీధర్ దేశ్ పాండే మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. వారి మృతి తెలంగాణ సమాజానికి, ముఖ్యంగా కళాకారుల లోకానికి తీరని లోటన్నారు. కొత్త పేట్ లోని మురళీధర్ దేశ్ పాండే గారి నివాసం లో ఆయన పార్థీవ దేహానికి బుధవారం కవిత నివాళులు అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జానపద, సాంస్కృతిక కళాకారులను ఏకం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని చెప్పారు. కళాకారుల హక్కుల కోసం, వారి గుర్తింపు, సంక్షేమం కోసం చివరి శ్వాస వరకు కొట్లాడరన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తిన సోషలిస్టు నాయకుడు మురళీధర్ దేశ్‌పాండే గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, తోటి ఉద్యమకారులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి

-సీసీ కెమెరాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన...

-జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ గ్రామసభలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్..




( జూన్ - 10- హంస కలంవార్త )

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు జూలూరుపాడు ఎల్లంకి గార్డెన్స్ నందు ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ గ్రామసభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. గ్రామాలలో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసుకొని రోడ్డు భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రోడ్డుపై విధులలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా,లేకపోయినా వాహనాలను నడిపేటప్పుడు నియమ,నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని కోరారు.డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్,ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడుపుతూ కనిపించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అనంతరం గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వాటి ప్రాముఖ్యత వివరించారు. గొడవలు, దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడానికి కేసుల పరిష్కారానికి సహాయపడతాయని గ్రామ ప్రజలకు వివరించారు. అనంతరం సైబర్ నేరాలపై ఎస్పీ అవగాహన కల్పించారు.అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని తెలిపారు.చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు బారిన పడుతున్నారని తెలిపారు.ఓటీపి ట్రాప్,ఆన్లైన్ ట్రేడింగ్,సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు ప్రభుత్వ నిషేధిత గంజాయిని ఎవరైనా సరఫరా చేస్తున్నట్లుగానీ,సేవిస్తున్నట్లు గానీ తెలిస్తే వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. చాలామంది యువత గంజాయి మత్తుకు బానిసలై తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎవరైనా గంజాయి సేవిస్తూ పోలీసులు పట్టుబడితే కేసు నమోదు చేయడమే కాకుండా జైలుకు పంపడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి ఒక్క పౌరుడు బాధ్యత. ప్రజల సహకారంతోనే నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ , మోటారు వాహనాల అధికారి వెంకట రమణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎస్సైలు , సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మోదీజీ వర్ధిల్లు నూరేళ్లు





-భారత్ లో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగుతున్న మోదీ

-కరీంనగర్ మీడియాతో కేంద్ర మంత్రి బండి సంజయ్

-మోదీ ఆయురారోగ్యాలతో నూరేళ్ల జీవించాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి

( జూన్ - 10- హంస కలంవార్త )

ప్రదాన మంత్రి నరేంద్రమోదీ రాబోయే 2047 సంవత్సరం వరకు భారత ప్రధానమంత్రిగా కొనసాగుతారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రపంచంలోనే భారత్ ను విశ్వగురు స్థానంలో నిలబెట్టే వరకు మోదీ విశ్రమించబోరని చెప్పారు. భారత ప్రధానిగా 4398 రోజులు పూర్తి చేసుకుని పండిట్ జవహార్ లాల్ నెహ్రూ రికార్డును మోదీ బద్దలు కొట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం ఉదయం కరీంనగర్ లోని శ్రీమహాశక్తి ఆలయంలో స్థానిక బీజేపీ నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోదీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, అభివృద్ధిలో భారత్ ను ప్రపంచంలోనే నెంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా క్రుషి చేస్తున్న మోదీకి భగవంతుడి ఆశీస్సులు అందించాలని కోరుతూ బండి సంజయ్ ఈ పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక బీజేపీ కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే. 'దేశ ప్రధానిగా 4,398 రోజులు ప్రధానిగా పూర్తి చేసుకుని జవహార్ లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టి అత్యధిక కాలం ప్రధానిగా చేసిన మహానుభావుడు నరేంద్రమోదీ. ఈ నేపథ్యంలో నాతోపాటు ఎంతో మంది దేశవ్యాప్తంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నెహ్రూ పాలనలో అవినీతి, అరాచకాలు, అస్తవ్యస్త, బంధుప్రీతి పాలన కొనసాగింది. కానీ మోదీ పాలనలో అందుకు భిన్నంగా అవినీతి, బంధుప్రీతికి తావు లేకుండా నిజాయితీ, నిబద్దతతో పాలనను కొనసాగిస్తున్నారని కొనియాడారు. మోదీ 12 ఏళ్ల పాలనలో దేశంలోని 25 కోట్ల మందిని పేదరికం నుండి బయట పడేశారు. రోడ్లు, రైల్వే, ఎయిర్, టెలికమ్యూనికేషన్ రంగాల్లో అనూహ్యమైన ప్రగతి సాధించారు. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాలను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. అవినీతికి తావులేకుండా సమాజంలోని అట్టడుగునున్న చిట్ట చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత మోదీకే దక్కుతుంది. అలాంటి గొప్ప వ్యక్తి నిండు నూరేళ్లు వర్ధిల్లాలి. 2047 వరకు దేశ ప్రధానిగా కొనసాగాలి. మోదీకి అమ్మవారు ఆయురారోగ్యాలతోపాటు శక్తిని కూడా ప్రసాదించాలని కోరుతున్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ పత్రాలను తిరస్కరించిన వ్యవహారం ఎన్నికల కమిషన్ పరిధిలోనిది. ఈ అంశాన్ని ఎన్నికల కమిషన్ చూసుకుంటుంది.

# నీటి వనరులను ఆదా చేసే విధంగా పంటల ఉత్పత్తి

-ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

( జూన్ - 10- హంస కలంవార్త )




నియోజకవర్గ పరిధిలోని తిమ్మాజీపేట మండలం బావాజీపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి, వ్యవసాయ రంగ పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ వరి సాగుపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా జొన్న, రాగి వంటి చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్ల తోటలు మరియు ఇతర లాభదాయక పంటలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఏర్పడవచ్చు అని భారత వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో నీటి వనరులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో తక్కువ నీటితో అధిక దిగుబడులు ఇచ్చే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రైతులను కోరారు. చిరుధాన్యాల వినియోగం దేశవ్యాప్తంగా పెరుగుతున్నందున వాటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, రైతులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగు చేపడితే ఆర్థికంగా మరింత లాభపడగలరని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగి ంచుకోవడంతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు, సలహాలను పాటించాలని సూచించారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ అనుబంధ రంగాలైన పశుపోషణ, ఉద్యానవనం, చేపల పెంపకం వంటి రంగాలపై కూడా రైతులు దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయ వృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారాన్ని జిల్లా యంత్రాంగం అందిస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో కొనసాగనున్న ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు అర్హులైన ఓటర్లు ఉండేలా, అనర్హులైన ఓటర్లను తొలగించే కార్యక్రమం చేపడుతుందని గ్రామంలోని ప్రతి ఒక్కరు సర్ కార్యక్రమం పై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. అనంతరం గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు తదితర అంశాలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాభివృద్ధికి ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయి అధికారులు సమయపాలన పాటించకుండా ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లాస్థాయి, మండల అధికారులు, గ్రామపంచాయతీ సభ్యులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కార్డుల పేరుతో వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

( జూన్ - 10- హంస కలంవార్త )

నిర్మల్ జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని,ఈ కార్డుల పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా హెచ్చరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.... అక్రిడిటేషన్ కార్డులు ఇప్పిస్తామంటూ కొందరు వ్యక్తులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇది తీవ్రమైన అంశమని పేర్కొంటూ,ప్రభుత్వం ఉచితంగా జారీ చేసే అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే సంబంధిత జిల్లా పౌరసంబంధాల అధికారి (డీపీఆర్వో)కి లేదా నేరుగా తమకు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందజేస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత

-పూడికతీత చేపట్టి నిజాంసాగర్, శ్రీరాంసాగర్ నీటి నిలువ సామర్థ్యం పెంచుతాం
-కాలువ కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి తక్షణ చర్యలు
-మేడిగడ్డ పునరుద్ధరణకు కృషి
-రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
-జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలకు ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి
-సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలన



( జూన్ - 10- హంస కలంవార్త )

ఉత్తర తెలంగాణ జిల్లాలలోని సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్ తదితరులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్ కు సంబంధించిన వివరాలతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు. 106 కోట్ల రూపాయల వ్యయంతో 7,975 ఎకరాల ఆయకట్టుకు నీరందించే జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలను అట్టహాసంగా ప్రారంభించారు. హెలికాప్టర్ లో సిద్దాపూర్ చేరుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కర్, నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, నిజామాబాద్ అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ తదితరులు హెలిప్యాడ్ వద్ద పుష్ప గుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాకోరాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి, పౌర సరఫరాలకు ఎనలేని ప్రాముఖ్యత ఇస్తోందని గుర్తు చేశారు. భూసేకరణ, అటవీ అనుమతులు, ఆర్ అండ్ ఆర్ తదితర వాటి కోసం ప్రభుత్వం రూ. 5వేల కోట్లు కేటాయిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఇందులో భాగంగానే లోయర్ మానేరు, మిడ్ మానేరు డ్యామ్ లు, కడెం ప్రాజెక్టులలో నీటి నిల్వ సామర్థ్యం పెంపొందించేందుకు పూడికతీత చేపడుతున్నామని తెలిపారు. అదే తరహాలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్, ఉత్తర తెలంగాణ జిల్లాలకు అత్యంత కీలకమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో కూడా పూడికతీత చేపట్టి రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం పెంపొందిస్తామని ప్రకటించారు. కాలువ కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజి లోపభూయిష్ట నిర్మాణం, డిజైన్ల వల్ల కొన్నాళ్ళకే కూలిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆక్షేపించారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరిట లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేశారని, అయినప్పటికీ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో కట్టిన మేడిగడ్డ బ్యారేజి కొన్ని రోజులకే కూలిపోవడం జరిగిందని, కానీ నిజాం నవాబు నిర్మించిన నిజాంసాగర్, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించబడిన శ్రీరాంసాగర్, నాగార్జున సాగర్, జూరాల ప్రాజెక్టులు మాత్రం ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఎంతో గట్టిగా నిలబడి ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. కాగా, సిద్దాపూర్ రిజర్వాయర్ పనుల పూర్తి కోసం సవరించిన ప్రతిపాదనల మేరకు అవసరమైన నిధులను తప్పక కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రైతాంగ ప్రయోజనాలు కాపాడడమే పరమావధిగా తమ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. దేశంలోనే మరెక్కడా లేని విధంగా తెలంగాణలో ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకుని 295 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. అందులో ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాల ద్వారా 145 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, 48గంటల లోపే రైతుల ఖాతాలలో బిల్లులు జమ చేస్తూ రూ. 35 వేల కోట్లు చెల్లించామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో సైతం రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి భరోసా కల్పించారు. నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని 5లక్షల కుటుంబాలలోని 3.25 కోట్ల మందికి ఒక్కొక్కరికి ప్రతీ నెల ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ సలహాదారు, స్థానిక శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటగా తన నియోజకవర్గంలో జాకోరా, చందూర్ ఎత్తిపోతల పోతకాలను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో బాన్సువాడ నియోజకవర్గ రైతులు పంటలు సాగు చేస్తూ, అధిక దిగుబడులు సాధిస్తున్నారని అన్నారు. మొత్తం లక్షా 48 వేల ఎకరాలలో పంటలు పండిస్తున్నారని, 95వేల ఎకరాల ఆయకట్టుకు నిజాంసాగర్ నీరు సమకూరుతోందని తెలిపారు. 30 వేల ఎకరాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు జలాలు అందిస్తున్నామని, నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో లేని మిగతా భూములకు కూడా సాగు జలాలు అందించాలనే కృత నిశ్చయంతో సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టామని అన్నారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే నియోజకవర్గంలో సాగు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సిద్దాపూర్ రిజర్వాయర్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్ రావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్, సీ.ఈ శ్రీదేవి, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, తహసిల్దార్ ప్రశాంత్, సర్పంచ్ సాయిలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ బలోపేతానికి కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు






( జూన్ - 10- హంస కలంవార్త )

రాబోయే విద్యా సంవత్సరంలో ప్రతి ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు "లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం"ను సమర్థవంతంగా అమలు చేయా లని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ,మోడల్ స్కూల్ హెచ్ఎంలు,కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లతో లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం, విద్యార్థుల నమోదు, ఇతర విద్యా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది విద్యార్థుల నమోదును 30 శాతం పెంచే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, విద్యార్థినుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఎల్లప్పుడూ వినియోగానికి అనువుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పాఠశాలల పురోగతికి సంబంధించిన అపార్ జనరేషన్, యూడైస్ అప్‌డేషన్ తదితర 22 రకాల పనితీరు సూచికలపై (పర్‌ఫార్మెన్స్ ఇండికేటర్లు) రోజువారీ సమీక్షలు నిర్వహించి పాఠశాలల గ్రేడింగ్‌ను మెరుగుపరచుకోవాలని సూచించారు. డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు ఖాన్ అకాడమీలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులతో పాటు సైన్స్, గణితశాస్త్ర ఉపాధ్యాయులను నమోదు చేసి రోజువారీ కార్యకలా పాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో బోధనా విధానాలను పరిశీలించేందుకు 9 మంది సభ్యులతో కూడిన ఇన్‌స్పెక్షన్ బృందం పర్యటిస్తోందని, వారికి ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందించాలని కోరారు. కాంప్లెక్స్ సమావేశాల్లో మోడల్ లెసన్స్,బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ పరీక్షలపై ప్రత్యేక ఎజెండాతో చర్చించి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.జిల్లాలో ఉన్న 12 జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే మంజూరైన 74 ప్రీ-ప్రైమరీ పాఠశాలలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలను జూన్ 15న ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సమక్షంలో పండుగ వాతావరణంలో ఘనంగా ప్రారంభించాలని తెలిపారు.విద్యార్థుల యూనిఫారాల కుట్టుపనులను మెప్మా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో డీఈఓ మాధవి, వివిధ శాఖల అధికారులు,ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ, మోడల్ స్కూల్ హెచ్ఎంలు,కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..
-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సహా సంక్షేమ పథకాలు అమలు..
-మున్నేరు వరద సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం..
-పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపుతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి..
-స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షించాలి..
-3.05 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో బీటీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన..
-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



( జూన్ - 10- హంస కలంవార్త )

ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రెన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇంట్లో కూడా అన్ని పనులను ఒకేసారి చేయలేమని, అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరం లోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. ఖమ్మం నగర అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. మున్నేరు వరదల నేపథ్యంలో రూ.600 కోట్లతో రిటైనింగ్ వాల్ ప్రాజెక్టుకు మంత్రి కృషి చేశారని, పనుల పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.వెలుగుమట్ల అర్బన్ పార్కును హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహాలో అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలు సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నా యని తెలిపారు. నగర సుందరీకరణ, పచ్చదనం పెంపుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ.. మంత్రి ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో మెరుగైన రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ. ప్రజా పాలనలో గత రెండున్నర సంవత్సరాలుగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందించి ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి డివిజన్‌లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఇక 'నో ఫ్రెండ్లీ పోలీసింగ్'

-డీజీపీ సీవీ ఆనంద్



( జూన్ - 10- హంస కలంవార్త )

తెలంగాణలో ఇకపై స్నేహపూర్వక పోలీసు వ్యవస్థకు స్వస్తి పలుకుతున్నామని, ప్రజలను గౌరవిస్తామని, కానీ రౌడీలు,గుండాలను మాత్రం సహించబోమని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణలో మావోయిజం అంతమైందని,గ్రేహౌండ్స్ విభాగాన్ని తీసివేస్తున్నామని,1700 మందిని కొత్త విభాగాలకు బదిలీ చేస్తున్నామని తెలిపారు. గంజాయి,డ్రగ్స్ నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని,సైబర్ క్రైమ్ తమకు పెద్ద సవాల్‌గా మారిందని ఆయన పేర్కొన్నారు.ఆదిలాబాద్ పోలీసులు అద్భుతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు.

# బిజినెస్

## బ్లెండర్స్ ప్రైడ్ ప్యాకేజ్డ్ వాటర్ ద్వారా 'బ్లెండర్స్ ప్రైడ్ రిజర్వ్ డ్ ఎక్స్ పీరియెన్సెస్' ఆవిష్కరణ




రుచి ఇంద్రియాల్లో ఏ విధంగా అనుభవించబడుతుంది పునః ఊహించడానికి రూపొందించబడిన ఒక కొత్త సాంస్కృతిక ప్లాట్ ఫాం 'బ్లెండర్స్ ప్రైడ్ రిజర్వ్ డ్ ఎక్స్ పీరియెన్సెస్' ను ప్రారంభించిన బ్లెండర్స్ ప్రైడ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్. వినియోగదారులు తమ సొంత అభివృద్ధి చెందుతున్న రుచులు మరియు ఎంపికలను చూపించే మరింత అర్థవంతమైన మరియు మెరుగైన అనుభవాల వైపు ఆసక్తి చూపిస్తున్న సమయంలో, 'బ్లెండర్స్ ప్రైడ్ రిజర్వ్ డ్ ఎక్స్ పీరియెన్సెస్' రుచిని మరింత ఏదో వ్యక్తీకరణగా మార్చడం ద్వారా ఈ మార్పుకు ప్రతిస్పందించింది.' ప్రతి కోణంలోను ప్రత్యేకమైనది' అనే భావన ఆధారంగా, ప్లాట్ ఫాం రుచిని బహు కోణీయ ప్రయాణంగా అందిస్తోంది- దీనిని కేవలం రుచి చూడటమే కాకుండా దీనిని చూడవచ్చు, వినవచ్చు, అనుభూతికి గురి కావచ్చు మరియు అనుభవించవచ్చు. ఛెఫ్ కూనల్ కపూర్ తో కూర్చబడిన, ఈ అనుభవం ఈ కలను సన్నిహితమైన, ప్రత్యేకమైన ప్రదర్శన ద్వారా నిజం చేసింది. ఆ సాయంత్రం యొక్క ప్రధాన ఆకర్షణ ఒక లైవ్ గ్యాస్ట్రో-ప్రదర్శనగా నిలిచింది. దీనిలో వాస్తవిక సమయంలో మ్యూజిక్ తో పాటు రుచి కూడా జోడించి ఆకృతి, సువాసన మరియు లయలను నిరంతరమైన ఇంద్రియ అనుభూతిగా తయారు చేయబడింది.ఈ అనుభవాన్ని ప్రత్యేకంగా చేసింది కేవలం నాలుకతో రుచి చూడటానికి పరిమితం కాకుండా, దానికి మించిన విధంగా రుచిని వ్యాఖ్యానించడం. చైతన్యవంతమైన దృశ్య వాతావరణాలు , సువాసన ఆధారిత ఇన్ స్టలేషన్స్ నుండి స్పర్శానుభూతి మరియు విభిన్నంగా రూపొందించిన రుచి చూసే అనుభవం వరకు, ప్రతి ఒక్కటి రుచిని ఒక విభిన్న కోణంలో వ్యాఖ్యానించేలా ఎన్నో లీనమయ్యే ప్రదేశాలను ఇది అందించింది.

# రెండు కొత్త క్లాసిక్స్ మాంచెట్ గడియారాలను పరిచయం




క్లాసిక్స్ మాంచెట్ రెండు కొత్త రూపాలతో తిరిగి వచ్చింది: ఒకటి ప్రత్యేకమైన మినరల్ ఎడిషన్, మరొకటి సన్‌రే డయల్. రాక్ ఎడ్జ్ శైలిని కలిగి ఉన్న ఈ జంట గడియారాలు, గోల్డ్-టోన్, స్టీల్ బ్రాస్‌లెట్‌లలో లభిస్తాయి. ఈ రెండు కొత్త మోడళ్లు శాశ్వత సేకరణలో భాగమయ్యాయి, ఇవి స్వేచ్ఛాయుతమైన మరియు గ్లామ్-చిక్ స్వభావాన్ని కలిగి ఉంటాయి. క్లాసిక్స్ మాంచెట్ మళ్ళీ వెలుగులోకి వచ్చింది. జెనీవాలో జరిగిన 'వాచెస్ అండ్ వండర్స్' కార్యక్రమంలో, ఈ తిరుగుబాటు సౌందర్యం అందరి దృష్టిని ఆకర్షించింది. బ్రాస్‌లెట్ మరియు టైమ్‌పీస్ రెండింటి లక్షణాలను కలిగి ఉన్న ఈ కొత్త వెర్షన్లు, ఈ శ్రేణి యొక్క రాక్-ఇన్ఫ్యూజ్డ్ మరియు ధిక్కారపూరిత వ్యక్తిత్వాన్ని పునరుద్ఘాట ిస్తున్నాయి. మొదటి కొత్త మాంచెట్ గోల్డ్ టోన్‌లో ఉంది, ఇది 'క్లౌ డి పారిస్' మోటిఫ్‌తో అద్భుతమైన ప్రభావాన్ని చూపుతుంది. దీని ప్రకాశవంతమైన మెరుపు, బోల్డ్ టర్కోయిస్ మినరల్ డయల్‌తో విరుద్ధంగా ఉంటూ ఆకర్షణీయంగా ఉంటుంది. ప్రతి డయల్ ఒక ప్రత్యేకమైన ముక్క. క్లాసిక్స్ మాంచెట్ సేకరణలోని రెండు కనిష్ట శైలి గల ముళ్ళు దీని ఉపరితలంపై తిరుగుతూ, "ఫ్రెడరిక్ కాన్స్టాంట్ -- జెనీవా" అనే వారి ప్రత్యేక సంతకంతో ఉంటాయి. ఈ మోడల్ 2025లో మలాకైట్ డయల్‌తో ప్రారంభించిన గడియారం యొక్క వారసత్వాన్ని కొనసాగిస్తుంది. టర్కోయిస్ రంగులో ఉన్న ఈ చిన్న సోదరి, మరింత ఉల్లాసభరితమైన జోడీని అందిస్తుంది. ఎరుపు తివాచీల గ్లామర్‌కు ఏమాత్రం తీసిపోని ఈ మాంచెట్ మధ్యలో బంగారు మరియు టర్కోయిస్ రంగులు కలిసి ఒకదానికొకటి సవాలు చేసుకుంటాయి. రెండవ వెర్షన్ స్టీల్ బ్రాస్‌లెట్ ఎంపికను అందిస్తుంది, ఇది కూడా 'క్లౌ డి పారిస్' మోటిఫ్‌ను ప్రదర్శిస్తుంది. మొదటి మోడల్ అందరి దృష్టిని ఆకర్షిస్తే, రెండవది రిఫ్రెషింగ్ మరియు స్ప్రింగ్-ప్రేరేపిత వైవిధ్యంతో తనదైన ప్రత్యేకతను చాటుకుంటుంది. సున్నితమైన సన్‌రే-బ్రష్డ్ మింట్-గ్రీన్ డయల్ మృదువైన, చల్లని రంగులను వెల్లడిస్తుంది. ఈ క్లాసిక్స్ మాంచెట్ దాని గ్లామ్ స్ఫూర్తిని కోల్పోకుండా, మరింత సూక్ష్మమైన రోజువారీ శైలికి తోడుగా ఉంటుంది. దీనిపై ఉన్న స్టడెడ్ అలంకరణ ఎలక్ట్రిక్ గిటార్ మీటినప్పుడు మణికట్టుపై నృత్యం చేస్తున్నట్లు అనిపిస్తుంది. మంచు కింద ఉన్న నిప్పు పట్ల జాగ్రత్త: పెరిగే శబ్దాలు మంచుపై పడే సూర్యరశ్మిలాగా, ఈ క్లాసిక్స్ మాంచెట్ యొక్క సాధువైన ఆత్మను కరిగించడానికి సరిపోతాయి.

# జెప్టో రూ.11,000 కోట్ల ఐపీఓ

తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రక్రియలో భాగంగా ప్రముఖ క్విక్ కామర్స్ కంపెనీ జెప్టో మంగళవారం సెబీకి నవీకరించిన ప్రాథమిక ముసాయిదా పత్రాలను (యూడీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓ లో భాగంగా ఈ కంపెనీ రూ.8,010 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన 11.35 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫఎస్) ద్వారా విక్రయించనుంది. ఐపీఓ ద్వారా మొత్తంగా రూ.11,000 కోట్ల వరకు సమీకరించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జెప్టో వ్యవస్థాపకులకు ఈడీ సమన్లు కంపెనీ వ్యవస్థాపకులు అదిత్ పలిచా, కైవల్య వోహ్రాకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. ఫారిన్ ఎక్ఛేంజ్ మేనేజ్‌మెంట్ చట్టం (ఫెమా)లో భాగంగా కంపెనీలో విదేశీ పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీలు, కంపెనీ వ్యాపారంపై సమాచారంతో పాటు పత్రాలు, పద్దులను ఈడీ కోరిందని సెబీకి సమర్పించిన ముసాయిదాలో వెల్లడించింది.




# ఐపీఎల్, భారత క్రికెట్‌పై విమర్శలు ఆపండి: సునీల్ గావస్కర్



ఇంటర్నెట్ డెస్క్:

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్), భారత క్రికెట్‌పై వస్తున్న విమర్శలపై టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ ఘాటుగా స్పందించాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఇంగ్లండ్ ప్లేయర్ జోఫ్రా ఆర్చర్.. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టుకు దూరమయ్యాడు. దీంతో ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ల నుంచి విమర్శలు ఎదురయ్యాయి. జాకబ్ బెథెల్ విషయంలో కూడా ఫ్రాంచైజీ క్రికెట్, అంతర్జాతీయ క్రికెట్ మధ్య పలు చర్చలు జరిగాయి. ఈ పరిణామాల నేపథ్యంలో గావస్కర్ విమర్శలకు గట్టిగా బదులిచ్చాడు. ఐపీఎల్, భారత క్రికెట్‌ను విమర్శించే వారే ఆదాయం కోసం తిరిగి బీసీసీఐని ఆశ్రయిస్తారని మండిపడ్డాడు.భారత క్రికెట్, బీసీసీఐపై విమర్శలు చేయడం కొందరికి అలవాటుగా మారింది. కానీ ఆదాయం కోసం వారు తిరిగి బీసీసీఐనే ఆశ్రయిస్తారు. ఎందుకంటే భారత క్రికెట్, భారత అభిమానులే వారి ఖజానాలను నింపుతున్నారు. ఐపీఎల్‌లో పాల్గొనే విదేశీ ఆటగాళ్ల ఫీజులో 10 శాతం వాటా ఆయా దేశాల క్రికెట్ బోర్డులకు లభిస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఐపీఎల్ కారణంగా తమ ప్లేయర్లు అంతర్జాతీయ క్రికెట్‌కు అందుబాటులో ఉండరని ఫిర్యాదు చేయడం అలవాటుగా మారింది. కానీ అదే ఐపీఎల్ ద్వారా ఆ దేశ బోర్డులకు అందుతున్న డబ్బు గురించి మాత్రం ఎవ్వరూ ఒక్క మాట కూడా మాట్లాడరు' అని గావస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.


**-ఆ పని చేసేది ఐపీఎల్ మాత్రమే..**

'ఐపీఎల్ ద్వారా ప్రతి ఏడాది విదేశీ బోర్డులకు లక్షల పౌండ్ల ఆదాయం వస్తోంది. మరి 'ది హండ్రెడ్' టోర్నీ విదేశీ ప్లేయర్ల బోర్డులకు వాటా ఇస్తుందా? బిగ్‌బాష్ లీగ్ లేదా ఇతర టీ20 లీగ్‌లు ఇస్తున్నాయా? లేదు కదా.. ఫారిన్ ప్లేయర్ల బోర్డులకు ఆదాయం కల్పించేది ఐపీఎల్ మాత్రమే. బీసీసీఐ, భారత క్రికెట్‌పై నిరంతరం విమర్శలు చేయడం ఆపాలి. వాస్తవాలను గుర్తించే సమయం వచ్చింది. భారత క్రికెట్ ఇక్కడే ఉంటుంది. దాన్ని ఎంత కిందకు లాగాలని ప్రయత్నించినా అది సాధ్యం కాదు' అని గావస్కర్ ఘాటుగా మాట్లాడాడు.

# మానవ్ సుతార్‌కు కౌంటీ క్రికెట్ కాంట్రాక్ట్

ఇంటర్నెట్ డెస్క్:

అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో యువ స్పిన్నర్ మానవ్ సూతార్ అదిరే ప్రదర్శనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. అరంగేట్రంలోనే 7 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఈ క్రమంలోనే సుతార్‌కు ఓ బంపరాఫర్ లభించింది. అతడికి ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో ఆడే అవకాశం దక్కింది. తాజాగా వార్విక్‌షైర్ క్రికెట్ క్లబ్ తరఫున సుతార్ ఒప్పందం కుదుర్చుకున్నాడు.ఈ ఒప్పందంతో 23 ఏళ్ల ఎడమచేతి స్పిన్నర్ మానవ్ సుతార్.. ఈ సీజన్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లోని తదుపరి రెండు రౌండ్ల మ్యాచ్‌ల్లో వార్విక్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహించ ున్నాడు. యార్క్‌షైర్, సమర్‌సెట్ జట్లతో జరిగే మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉండను న్నట్లు క్లబ్ ప్రకటించింది. అఫ్గానిస్థాన్‌పై టెస్టు అరంగేట్రంలోనే అద్భుత ప్రదర్శనలతో మెరిసిన సుతార్ జట్టు విజయానికి కీలకంగా నిలిచాడు. అంతకుముందు దేశవాళీ క్రికెట్‌లో కూడా అద్భుతంగా రాణించిన అతడు 29 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 129 వికెట్లు పడగొట్టి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. సుతార్ రాకతో తమ బౌలింగ్ దళానికి కొత్త బలం చేకూరుతుందని వార్విక్‌షైర్ యాజ మాన్యం అభిప్రాయపడింది. కౌంటీ ఛాంపియన్‌షిప్ టైటిల్ పోరులో జట్టుకు అతడి సేవలు ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సుతార్ కూడా ఆనందం వ్యక్తం చేశాడు. 'వార్విక్‌షైర్ జట్టులో చేరడం చాలా సంతోషంగా ఉంది. జట్టుకు టైటిల్ అందించేందుకు కృషి చేస్తాను' అని తెలిపాడు. భారత టెస్టు జట్టులో అరంగేట్రం చేసిన కొద్ది రోజుల్లోనే కౌంటీ క్రికెట్‌లో అవకాశం దక్కించుకోవడం సుతార్ కెరీర్‌లో కీలక మైలురాయిగా నిలిచింది.



# స్పోర్ట్స్

## చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్.. 21 ఏళ్ల తర్వాత




స్పోర్ట్స్ డెస్క్:

వన్డే క్రికెట్‌లో బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. 21 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆస్ట్రేలియాపై వన్డే మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నిన్న( మంగళవారం) ఢాకా వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ డక్‌వర్త్ లూయిస్ పద్దతి ద్వారా 86 పరుగుల తేడాతో కంగారు జట్టును ఓడించింది.ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. మోసాడెక్ హోస్సేన్(86 నాటౌట్), నజ్ముల్ హొస్సేన్ షాంటో(67), తంజిద్ హసన్( 54) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఎల్లిస్ మూడు వికెట్లు పడగొట్టాడు. లియామ్ స్కాట్, మ్యాట్ రేన్‌షా రెండేసి వికెట్లు సాధించారు. గ్జేవియర్ బార్ట్‌లెట్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం 285 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా.. వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి 42.2 ఓవర్లలో 9 వికెట్లకు 191 పరుగులే చేసింది. ఆ తర్వాత వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు డక్‌వర్త్ లూయిస్ ప్రకారం మ్యాచ్ ఫలితాన్ని తేల్చారు. 86 పరుగుల తేడాతో బంగ్లా విజయం సాధించింది. అలెక్స్ క్యారీ 47), కామెరూన్ గ్రీన్ ( 52 నాటౌట్), కూపర్ కనోల్లీ(35) మినహా అంతా విఫలమయ్యారు. బంగ్లా బౌలర్లలో నహిద్ రాణా నాలుగు వికెట్లు తీయగా.. ముస్తాఫిజుర్ రెహ్మాన్, మొసాడెక్ హుస్సేన్ రెండేసి వికెట్లు పడగొట్టారు. టస్కిన్ అహ్మద్ ఒక వికెట్ సాధించాడు. సొంతగడ్డపై వన్డే క్రికెట్‌లో ఆస్ట్రేలియాను ఓడించడం బంగ్లాదేశ్‌కు ఇదే తొలిసారి. 2005లో కార్డిఫ్‌లో జరిగిన నాట్‌వెస్ట్ సిరీస్‌లో బంగ్లాదేశ్ తొలిసారిగా కంగారు జట్టుపై విజయం సాధించింది. సుమారు 21 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియాపై రెండో విజయాన్ని నమోదు చేసింది.

# రామ్ చరణ్ 'పెద్ది' వివాదంపై అదా శర్మ కామెంట్స్

'ది కేరళ స్టోరీ'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అదా శర్మ త్వరలోనే 'గవర్నర్' అనే పవర్‌ఫుల్ చిత్రంతో మన ముందుకు రాబోతున్నారు. మనోజ్ బాజ్‌పేయి ప్రధాన పాత్రలో, చిన్మయ్ మాండ్లేకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ పొలిటికల్ థ్రిల్లర్, 1990ల నాటి భారత ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో తెరకెక్కింది. ఆర్బీఐ గవర్నర్ దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి ఎలా రక్షించారనే యథార్థ సంఘటనల ఆధారంగా విపుల్ షా నిర్మించిన ఈ చిత్రం జూన్ 12న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రమోషన్లలో భాగంగా అదా శర్మ.. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాలో జాన్వీ కపూర్ పాత్రపై జరుగుతున్న ట్రోలింగ్‌పై ఆసక్తికరంగా స్పందించారు. 'పెద్ది' సినిమాలో మహిళలను అభ్యంతరకరంగా చూపించారనే విమర్శలతో దర్శకుడు బుచ్చిబాబు సనా ఇప్పటికే క్షమాపణలు చెప్పి ఆ సీన్లను తొలగించిన సంగతి తెలిసిందే. దీనిపై అదా మాట్లాడుతూ.. తాను ఆ సినిమాలో నటించలేదని, ఇంకా చూడలేదని చెబుతూనే, ఇండస్ట్రీ బ్యాక్‌గ్రౌండ్ లేని తన ప్రయాణం వేరని, కాబట్టి ఆ వివాదంపై మాట్లాడటం సరైంది కాదని చాకచక్యంగా తప్పించుకున్నారు. అయితే, నటీనటులు, దర్శకులు, రచయితలు ప్రాజెక్ట్‌లను ఎంచుకునేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, మన చిన్న తప్పుడు నిర్ణయం సమాజంపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. మహిళలకు భిన్నమైన కోణాలు ఉన్న స్క్రిప్టులనే తాను ఇష్టపడతానని ఆమె స్పష్టం చేశారు.




## యాక్షన్ అవతార్‌లో అలియా భట్.. ఉత్కంఠ రేపుతున్న 'ఆల్ఫా' ప్రోమో



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ తన సరికొత్త యాక్షన్ అవతార్‌తో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ (వైఆర్‌ఎఫ్) ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న స్పై యూనివర్స్ నుంచి రాబోతున్న కొత్త చిత్రం 'ఆల్ఫా'. ఈ సినిమాకు సంబంధించిన ప్రోమోను బుధవారం విడుదల చేయగా, అందులో అలియా మునుపెన్నడూ చూడని రీతిలో హై-ఆక్టేన్ యాక్షన్‌తో అదరగొట్టారు. ప్రోమో ప్రారంభంలో అలియా తన 18వ పుట్టినరోజును తండ్రి (బాబీ డియోల్)తో జరుపుకుంటున్నట్లు కనిపిస్తుంది. తండ్రీకూతుళ్ల మధ్య ప్రేమగా మొదలైన ఈ సన్నివేశం, ఆ తర్వాత ప్రమాదకరమైన ప్రయాణానికి నాంది పలుకుతుంది. ఆమె జీవితాంతం నేర్చుకున్న కఠినమైన శిక్షణ కేవలం పెద్దయ్యాక బతకడానికి కాదని, తన 18వ పుట్టినరోజునే ఆమె మొదటి మిషన్‌కు సిద్ధం కావడానికని బాబీ డియోల్ పాత్ర వెల్లడిస్తుంది.ఆ తర్వాత టీజర్‌లో అలియా భయంకరమైన పోరాట సన్నివేశాల్లో కనిపిస్తుంది. ప్రత్యర్థులను కాలితో తన్నడం, పంచ్‌లు విసరడం, ధైర్యంగా పోరాడటం వంటివి ఆమె పాత్రను ఒక పవర్‌ఫుల్ ఏజెంట్‌గా పరిచయం చేస్తున్నాయి. 'ఆల్ఫా'గా మారడమే లక్ష్యంగా ఆమెకు శిక్షణ ఇచ్చినట్లు ఈ సన్నివేశాలు స్పష్టం చేస్తున్నాయి.

## 'పెద్ది' సక్సెస్‌పై అల్లు అర్జున్ పోస్ట్, రామ్ చరణ్ క్రేజీ రిప్లై

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో వచ్చిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. జూన్ 4న విడుదలైన ఈ క్లాసిక్ విలేజ్ డ్రామా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా 'పెద్ది' చిత్ర బృందానికి, ముఖ్యంగా తన బ్రదర్ రామ్ చరణ్‌కు అభినందనలు తెలుపుతూ ఒక ప్రత్యేకమైన పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అయింది.తాజాగా అల్లు అర్జున్ అభినందనలపై రామ్ చరణ్ స్పందించారు. అల్లు అర్జున్ పెట్టిన పోస్ట్‌ను రీ-షేర్ చేస్తూ.. "నీ విషెస్ నాకు, అలాగే మా మొత్తం 'పెద్ది' టీమ్‌కు ఎంతో ప్రత్యేకం బన్నీ. థాంక్యూ సో మచ్" అంటూ చరణ్ తన ప్రేమాభిమానాలను చాటుకున్నారు. అంతేకాదు, ప్రస్తుతం అల్లు అర్జున్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రాకా' కోసం తాను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్టార్ హీరోలు ఇద్దరూ ఒకరి సినిమాలను మరొకరు ప్రమోట్ చేసుకుంటూ, ఇలా ఒకరికొకరు సపోర్ట్‌గా నిలవడం ఇండస్ట్రీలో ఒక గొప్ప హెల్తీ వాతావరణానికి నిదర్శనమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. హీరోల మధ్య ఉన్న ఈ బాండింగ్ చూసి అటు మెగా, ఇటు అల్లు అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.



# భయపెట్టనున్న జాన్వీ కపూర్

## తుంబాడ్' దర్శకుడితో హారర్ జోనర్‌లో కొత్త సినిమా!

-తుంబాడ్' ఫేమ్ రాహి అనిల్ బర్వేతో జాన్వీ సినిమా

-భారీ బడ్జెట్‌తో క్రీచర్ హారర్ చిత్రంగా రూపకల్పన

-ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ప్రాజెక్ట్

-అన్నీ కుదిరితే ఈ ఏడాదే చిత్రీకరణ ప్రారంభం

-జియో స్టూడియోస్ నిర్మాణంలో తెరకెక్కనున్న సినిమా



బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ వరుసగా భారీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. తాజాగా ఆమె మరో ఆసక్తికర చిత్రానికి అంగీకరించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కల్ట్ క్లాసిక్ హారర్ ఫిల్మ్ 'తుంబాడ్' ఫేమ్ దర్శకుడు రాహి అనిల్ బర్వే దర్శకత్వంలో ఓ భారీ క్రీచర్ హారర్ చిత్రంలో నటించేందుకు జాన్వీ చర్చలు జరుపుతున్నట్టు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయని సమాచారం. అంతా సవ్యంగా జరిగితే ఈ ఏడాది చివర్లోనే సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ప్రముఖ నిర్మాణ సంస్థ జియో స్టూడియోస్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. 'తుంబాడ్' తర్వాత రాహి అనిల్ బర్వే హారర్ జోనర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన దర్శకత్వంలో సినిమా అనగానే ప్రేక్షకుల్లోను, పరిశ్రమలోను ఆసక్తి నెలకొంది.ఈ చిత్రానికి సంబంధించిన కథ, ఇతర నటీనటుల వివరాలను మేకర్స్ చాలా గోప్యంగా ఉంచుతున్నారు. అయితే, జాన్వీతో చర్చలు ఫలించి, ఆమె ఈ ప్రాజెక్టులో భాగమైతే తన కెరీర్‌లో ఇది మరో ముఖ్యమైన సినిమా అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం రాహి అనిల్ బర్వే పలు హారర్ ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, వాటిలో ఇది ఒకటని తెలుస్తోంది. ఈ వార్తలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఆయన నాపై చెరగని ముద్ర వేశారు: భారతీరాజా మృతిపై చిరంజీవి భావోద్వేగం!

## -ఈ ఉదయం తుదిశ్వాస విడిచిన భారతీరాజా

## -భారతీరాజాతో నటించిన అనుభవాన్ని గుర్తు చేసుకున్న చిరంజీవి

## -ఆయన చిత్రాలు కోట్లాది మంది హృదయాలను తాకాయన్న మెగాస్టార్



దర్శక దిగ్గజం భారతీరాజా ఈ ఉదయం అనారోగ్య సమస్యలతో కన్నుమూయడంతో సినీ పరిశ్రమ షాక్‌కు గురైంది. ఆయన మృతి పట్ల సినీ లోకం ఘనంగా నివాళులర్పిస్తోంది. ఈ క్రమంలోనే, భారతీరాజా దర్శకత్వంలో నటించిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా అత్యంత భావోద్వేగ భరితమైన పోస్ట్ పెట్టారు. భారతీయ సినిమా ఈ రోజు ఒక గొప్ప కథకుడిని కోల్పోయింది అని చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ మట్టి సువాసనలను, మానవ సంబంధాల అందాలను, ప్రేమలోని అమాయకత్వాన్ని, సామాన్య ప్రజల భావోద్వేగాలను భారతీరాజా గారు ఎప్పటికీ నిలిచిపోయే ఒక సినిమా కవిత్వంగా మార్చారని కొనియాడారు. ఆయన చిత్రాలు కోట్లాది మంది హృదయాలను తాకడమే కాకుండా, ఎన్నో తరాల సినీ దర్శకులకు స్ఫూర్తిగా నిలిచాయని గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా భారతీరాజా గారి దర్శకత్వంలో వచ్చిన క్లాసిక్ హిట్ 'ఆరాధన' సినిమాలో 'పులిరాజు' అనే పాత్రలో నటించే అద్భుతమైన అదృష్టం తనకు దక్కిందని చిరంజీవి పేర్కొన్నారు. ఆ సినిమా సమయంలో భారతీరాజా గారు తనపై చెరగని ముద్ర వేశారని మెగాస్టార్ గుర్తుచేసుకున్నారు. ప్రతిష్ఠాత్మక పద్మశ్రీతో పాటు పలు జాతీయ అవార్డులు అందుకున్న భారతీరాజా గారు భారతీయ సినిమాకు అందించిన సహకారం వెలకట్టలేనిదని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని చిరంజీవి ప్రార్థించారు.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449